
ఆంక్ష పెడితే అలా చెయ్యాలనే కాంక్ష పుట్టడం సహజం. ఆంక్ష పెట్టేవాళ్ళూ అలా చెయ్యాలనే అనుకుంటే...?

# ముగింపు

మల్లాప్రగడ రామారావు



వింటూనే వున్నాను.

"వినపడ్డంలేదు కాబోలు !"

"అన్నన్నే ఎలా వినపడుతుంది ?"

"అమ్మగారి లోకంలో వున్నట్టు లేరు ?"

ఇక వుండబట్టలేక వెనక్కి తిరిగాను.

ఆయన చూపు మరల్చుకొని పడకకుర్చీ వేపు నడవసాగారు. అందులో కూర్చుంటే ఆయన ముఖం నాకిక్కడ నుంచీ కనబడదు. వీపు నాకేసి త్రిప్పి వుంటుంది.

అనబోయిన మాటలు అతికష్టం మీద పెదవులు దాటకుండా ఆపుకోగలిగాను.

పడక్కుర్చీలోంచి "హనుమాన్‌చాలీసా" వినబడుతోంది.

ఒళ్లుమండింది. "వచ్చినవాడు త్రాష్టుడు కాడు. మా కంపెనీలో సేల్స్ ప్రమోషన్ ఆఫీసర్" అన్నాను. ఇందాకటి ఆయన ప్రశ్నకి సమాధానంగా. జవాబు లేదు.

హనుమాన్ చాలీసా క్షణం ఆగి కొనసాగుతోంది. ఏం చెయ్యను. ఈ సారి నామీద నాకే మండుకొచ్చింది. ఏడుపొచ్చింది.

వెనగ్గదిలోకి పోబోయాను.

"వాడెందుకవుతాడులే. నిన్ను కట్టుకున్నందుకు నేను త్రాష్టుడనయ్యాను కాని."

వెనగ్గది గడపవరకూ వెళ్ళేను.

"చూడూ ! ఆఖరుసారి చెప్తున్నాను. కేంపుల్లో ఎలాగైనా తగలడు. ఇంటిదగ్గర మాత్రం లంజ వేషాలువేస్తే వూరుకొనేది లేదు."

ఛి ఛీ. నా బ్రతుకు నాకే అసహ్యమనిపించింది. అలాంటప్పుడెప్పుడూ ఒక దృశ్యమే కళ్ళలో మెదుల్తుంటుంది.

మ్రోగుతున్న సన్నాయి. అర్థంకాని మంత్రాలు. కొబ్బరిమట్టల పచ్చదనం. తలపై తలంబ్రాలు. అన్నిటినీమించి పదకొండేళ్ళమ్మాయి. అమాయకపు ముఖం.

అందులో వుత్సాహం పురకలువేసే కళ్ళు రెండు.

బ్రతుకంటే బెదురు లేని వయసు. పెళ్ళంటే పల్లకిలో వూరేగడం అని మాత్రమే తెలుసు.

మావయ్యకి ముప్ఫయ్ ఏళ్ళని తెలుసు. అంటే యేమిటో మాత్రం తెలియదు. మామయ్య మొగుడంటేనూ అంతే.

మావయ్యకేం బాగానే వుంటాడు. ఎప్పుడేనా యింటికొస్తే ఏదో ఒకటి తెస్తాడు— అత్తరో, పన్నీరో. పట్టు జుబ్బా తొడుక్కొని, సెంటుపూసుకుని ఘుమఘుమలాడుతుంటాడు. ఒక రోజు దొడ్లో బావి దగ్గర దొంగతనంగా పెదవులమీద ముద్దు పెట్టుకుని, కోపంగా చూస్తే ఘొల్లున నవ్వాడు కూడా.

"మావయ్యని పెళ్ళాడుతావుటే!" అని అమ్మమ్మ అడిగితే "ఓ" అంది.

"అలా చెప్పు మీ నాన్నతో. మగవాడికేం లక్ష తిరుగుళ్ళు తిరుగుతాడు. అంత మాత్రాన వున్న ఒక్క బావమరిదికే కూతుర్నియ్యనంటాడా?" అంది అమ్మమ్మ.

అందుకే నాన్న ఎప్పుడూ జ్ఞాపకం వస్తాడు. జీవితంలో వున్న దుఃఖాన్నంతటినీ యిముడ్చుకున్నట్లుండేవి నాన్నకళ్ళు. ఆ కళ్ళు మరపుకురావు. ఎన్నో రాత్రులు-వయసొచ్చాక, బ్రతుకులో కోల్పోయిందేమిటో తెలిసొచ్చాక-చీకట్లోకి చూస్తుంటే ఆ కళ్ళు కనిపించినట్లుండేవి.

"మావయ్యని పెళ్ళాడు తాను నాన్నా" అంటూ గెంతులేస్తూ వెళ్ళినపుడు, వెనకాలే అమ్మమ్మ. ఆ వెనకాల, అమ్మ వున్నపుడు, నాన్న ఏం మాట్లాడలేదు. "తల్లీ" అంటూ తల నిమిరాడు. నాన్న కళ్ళు చెమర్చాయో, కన్నీళ్ళు సుళ్ళు తిరిగాయో నాకైతే కనబడలేదు.

"నయమేనమ్మా. బావురుమని ఏడవలేదు నీ మొగుడా మాటవిని" అంది అమ్మమ్మ- తర్వాత అమ్మతో. అమ్మ నవ్వింది. అమ్మనవ్వు తెలియని భయం కల్గించేది నాకెప్పుడూ.

"మొగుడన్నవాడికి యింత కాఫీ తగలేసే దిక్కులేదు యింట్లో. మిండగాళ్ళొస్తే మట్టుకు అన్నిమర్యాదలూ...." వినదలుచుకోలేదు. ఓపిక చేసుకుని మంచంమీంచి లేచి, పర్సులోంచి రెండు ఐదురూపాయల నోట్లు తీసి, పట్టికెళ్ళిస్తే విచ్చుకుంది ముఖం. అదే మిగిలిన సంబంధం యిద్దరి మధ్యా. ఇల్లూ, వొళ్ళూ గుల్లైన తర్వాతే ఈ సంబంధమైనా యేర్పడింది.

"పదారు నా వయసు" అనుకోకుండానే వేవిళ్ళు మొదలయ్యాయి. నాన్న కళ్ళలో ఏమూలో కాసింత వెలుగు తళుక్కుమంది.

కాని పుట్టిన పిల్లని చూడగానే అమ్మ నవ్వుకూడా మాయమైంది.

ఆ పిల్ల చచ్చి పుట్టడమే అందరికీ ఉపశాంతి కలిగించింది.

నవ్వడం మరచిపోయిన అమ్మలో




పొదుపునందలి ఆనందానికి సిండికేట్ బ్యాంక్ ఒక మార్గదర్శి

సిండికేట్ బ్యాంక్

వికాస్ రొఖపు సర్టిఫికేట్లు

(తిరిగి పెట్టుబడి పెట్టే పథకం



మిక్కలి యిక్కట్టు సమయములలో డబ్బు కావలసివచ్చినపుడు, మరియు తాము అర్థికంగా చిచికిపోయినపుడు, ప్రతి మనిషి దిగాలు పడిపోయి, తన ముందుచూపు లేమికి తమ్ము తాము నిందించుకొంటారు.

మీకు యిలా జరిగే అవకాశం రానీయకండి.

అయితే మీ కోరిక లెంతవరకున్నాయి? మీ కుమారుడు, కుమార్తె ఉన్నత విద్యల లాభం పొందాలని, తమ జీవితారంభంలోనే వారు చక్కని పునాదులు వేసికోవాలని, అంతేగాక మీరుకూడా మీ చరమ జీవితాన్ని సుస్థిరమైన స్థాయిలో నడుపుకోవాలని-అంతేగదూ...

ఇవన్నీ మరియు యింకా యెన్నోకూడా మీరు యిప్పటి నుండియే సరియైన పొదుపు పథకము వేశారంటే పొందవచ్చు సుమా. పొదుపు తప్పనిసరి. మీ పొదుపు సొమ్మును వికాస్ సర్టిఫికేట్లయందు పెట్టుబడి పెట్టండి. ఇవి మీకు అన్ని సమయాల్లోను అందుబాటులో వుంటూ, చేతికంది వస్తాయి. రు. 1000/-ల సర్టిఫికేటు యెంతెంత కాలానికి యెంతెంత విలువకు ఫలిస్తుందో యీ క్రింద తెలుపబడివుంది.

| | | |
|---|---|---|
| 39 నెలలకు | .... | రు. 1314-50 కి |
| 4 యేండ్లకు | .... | రు. 1400-00 లకు |
| 5 యేండ్లకు | .... | రు. 1523-00 లకు |
| 63 నెలలకు | .... | రు. 1680-00 లకు |
| 87 నెలలకు | .... | రు. 2046-50 లకు |

రొఖం కంటే మేలైనది మరికొంత రొఖం

సిండికేట్ బ్యాంక్‌నకు తప్పకరండి.

సిండికేట్ బ్యాంక్

maa SB100

HIGH STANDARED BOOKS
Choice of Millions
వైరింగ్ & కట్టింగ్ గైడు రూ.30/-
రేడియో అండ్ ట్రాన్సిస్టర్ గైడు 35/-
300 కుటీర పరిశ్రమల గైడు30/-
సెక్స్ అట్లాస (యు.ఎస్.ఏ ప్రచురణ)-
15/పడక గదిలో 68 రంగుల ఫోటోలు
15/-పురుషుడు స్త్రీని వశపరచుకునే-
విధానం15/- కామ సూత్రాలు—
(వాత్స్యాయన)15/- కోక శాస్త్రం —
(112 బొమ్మలతో)15/-144 రహస్య-
కెమెరా ఫోటో అల్బమ్ 30/.
POSTAGE Rs. 4/-Extra
RAJKAMAL PRAKASHAN
(AJW) Aligarh-35

చెవుడుకు చికిత్స
చెవినుంచి చీము కారడం, చెవిలో పెద్ద ధ్వని రావడం, చెవుడు లేదా చెవికి సంబంధించిన ఏదేని అనారోగ్యము పూర్తిగా నయము చేయబడును. ధర రు. 20/—పూర్తి కోర్సు రు. 50/—లు ఉపయోగపడనట్లు ఋజువైతే సొమ్ము వాపసు.
JANTA AUSDHALAYA (R 2)
PO. LALBIGHA (GAYA)

నెరసిన జుట్టు
రంగులవెల్లి కాదు. మా కేశరంజని ఆయుర్వేదిక్ హెయిర్ ఆయిల్ నెరసిన జుట్టుకు మామూలు నల్లరంగు నిస్తుంది. పైగా అది మెదడుకు, కళ్ళకు మంచి టానిక్కు. ధర రు. 12/— పంతృప్తి. శాశ్వత పలితాలకి 3 సీసాల్ రు. 27/—.
SHYAM AYURVED BHAVAN
P.O. KATRI SARAI (GAYA)

అప్పుడు కనబడింది అమ్మ. నాన్నకూ భార్య అప్పుడే దొరికి వుంటుంది.

అమ్మగామారిన అమ్మ ఒంటినున్న రోగం వదిలేటట్టు చెయ్యగలిగింది. ఇంట్లో వుండే మెట్రిక్ పరీక్ష పాసయ్యేందుకు వీలు కలిగించింది.

యాభయ్యేళ్ళొచ్చి. ఆస్తిపోయి. ఆరోగ్యం అంతకుముందే పోయి "మొగుడు" యింటికొచ్చేసరికి. యిద్దరినీ ఆదుకొనేందుకు సబ్బుల కంపెనీ "సేల్స్ అసిస్టెంట్" ఉద్యోగం ఒక్కటే మిగిలింది. ఈ ఉద్యోగంలో పది మందితోనూ పరిచయాలు తప్పవు. నెలకో ఇరవై రోజులన్నా వూళ్ళంట తిరగక తప్పదు. ఇంటిలోవున్న కొద్ది రోజులూ ఆయన అంటగట్టే రంకులు తప్పవు.

ముప్ఫయ్యమూడేళ్ళొచ్చినా పచ్చిగా వున్న నాయౌవనంవేపు మగాళ్లు లోభంగా చూడడం తప్పదు. ఉద్యోగం కారణంగా నన్నూ ఒక "వెలవున్న వస్తువు"గా ఎంచి "రేటెంత" అన్న ధోరణిలో మాట్లాడే పరసాలూ తప్పవు. లాడ్జెస్‌లో వుండాల్సొచ్చినపుడు ప్రశ్నార్థకాలూ. ఆశ్చర్యార్థకాలూ. అర్థమయిందన్నట్లు నవ్వులూ ఏవీ తప్పవు.

ఇంటికొస్తే చెయ్యనివన్నీ చేసినట్టు రంపపుకోత కొయ్యడం తప్పదు.

అనిపిస్తుంది ఒక్కోప్పుడు "ఎందుకీ కాపాడుకోవడం" అని. ఆయన అంటున్నట్టే "ఒకసారి" చేస్తే అని. ఎప్పుడో మరచిపోయిన అనుభవం "ఆ చేదు" లేకుండా మరోసారి, మరోసారి పొందితే అని.

ఒంటరి రాత్రి. చుక్కలు. పాడే పిట్టలు. ఎదురొమ్మున ఏదో బాధ.

ఒళ్ళు నిమిరేగాలి. చచ్చి పుట్టిన నా బిడ్డ.

నాన్నకళ్ళు. అమ్మ నవ్వు.

నామీద నాకే దుర్భరమైన జాలి కలుగుతుంది. కోర్కెదోపుట్టి గుండెల్ని పిండుతుంది. చేతివేళ్ళ సందుల్లోంచి జీవితం జారిపోతున్నట్టు బాధ! నా నిట్టూర్పుతో వెన్నెల అంటుకుంటుంది.

తలుపు చేరేసుకు వెళ్ళేరాయన. తలుపు తోసిన శబ్దమైతే హోటల్‌నుంచి ఆయనే తిరిగొచ్చారనుకున్నాను.

ఆయన కాదు. "అహల్యగారూ!" అన్న గొంతు మా కంపెనీ సేల్స్ ప్రమోషన్ ఆఫీసర్‌ది. ఎప్పుడూ ఇతరులెవ్వరినీ ఆ వెనగ్గదిలోకి రానియ్యను. మరి ఏమాలోచిస్తున్నానో .... మంచంమీద పడుకునే "ఏం మళ్ళీ వచ్చారు? లోపలికి రండి" అన్నాను.

మంచంమీద ఆ భంగిమలో పడుకుని వున్న నన్ను చూడగానే మరచిపోయినట్టున్నాడాయన మళ్ళీ ఎందుకొచ్చాడో. ఇంకేదో అవసరమేర్పడినట్టు తెలుస్తూనే వుంది.

నవ్వాను. కావాలనే చెయ్యి చాపి మంచంమీద కూర్చోబెట్టానో లేదో చెప్పలేను.

* * *

సావన్నారాయణ హోటల్ నుంచి యింటికి తిరిగొచ్చేసరికి గదిలోని బల్లమీది "బేగ్" మొదటగా అతడి దృష్టి నాకర్షించింది.

నిశ్శబ్దంగా రెండడుగులువేసి వెనగ్గది కిటికీలోంచి మంచంకేసి ఓసారి చూసి. వెనుదిరిగి ముందుగది తలుపు శబ్దం కాకుండా చేరవేసి వీధిలోకి వచ్చాడు. మోయలేని బరువు దింపుకున్నవాడిలా చలాగ్గా అడుగులేస్తూ సముద్రంవేపు నడిచాడు

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన మొదల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి. Address
Samaj Kalyan (R.L. 78)
(P. O) Katri sarai (Gaya)

